## అకాడమిక్ క్యాలెండర్‌ను అనుసరించాలి

ములుగురూరల్, జూలై 3 : జిల్లాలోని అన్ని మండల విద్యావనరుల కేంద్రాలు, యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో అకాడమిక్ క్యాలెండర్‌ను అనుసరించి తరగతులను నిర్వహించాలని డీఈవో పాణిని అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో కలిసి అకాడమిక్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో ముందు నుంచే ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి విజయమ్మ, డీఈవో కార్యాలయ కోఆర్డినేటర్లు రాజు, సాంబయ్య, రమాదేవి, బోర్డు సభ్యులు రమేష్, సహాయ కార్యదర్శి విక్రమ్‌రాజ్ పాల్గొన్నారు.

## వాజేడు మండలంలో భారీ వర్షం

వాజేడు, జూలై 3 : మండలంలోని ప్రగళ్లపల్లి, కొప్పుసూరు, ఆరుగుంటపల్లి తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో ప్రజలు భయందోళనకు గురయ్యారు. అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలి

ఏటూరునాగారం, జూలై 3 : వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఏఈ అశోక్, లైన్ ఇన్‌స్పెక్టర్ కొండా సమ్మయ్య ఒక ప్రకటనలో కోరారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోవద్దని, బట్టలు ఆరేసే వైర్లకు విద్యుత్ సరఫరా కాకుండా చూసుకోవాలన్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లకుండా ఉండాలని, స్టార్టర్ డబ్బాలు నీటిలో తడవకుండా చూడాలని, డబ్బాలు ఇనుపవి కాకుండా ప్లాస్టిక్ వాటిని బిగించుకోవాలని సూచించారు. ఓల్టేజీ హెచ్చు తగ్గులు ఉంటే వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలియచేయాలని, అతుకులు లేని సర్వీసు వైరు ఉపయోగించుకోవాలని కోరారు. విద్యుత్ సమస్యలపై వెంటనే తమకు తెలియచేయాలని కోరారు.

## హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కేసు నమోదు

ములుగురూరల్, జూలై 3 : హత్యాయత్నం చేసిన వారిపై సోమవారం ములుగు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి గ్రామానికి చెందిన భూక్యా బాలు ఇంటి పక్కన పెంట కుప్ప పోసుకుంటుండగా పక్క ఇంటి వ్యక్తి రత్న సాంబయ్య అతని భార్య మంజుల వారి కొడుకు తరుణ్ అడ్డుకొని బాలుతో గొడవ పడి భౌతికదాడికి పాల్పడ్డారన్నారు. ఈ విషయాన్ని వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ములుగు ప్రేమ్‌నగర్ మీదుగా బాలు భార్య సుకినితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడని తెలిపారు. ప్రేమ్‌నగర్‌కు చేరుకునే సరికి రత్న తరుణ్ తన ఆటోతో వెనుక నుంచి బాలు బైక్‌ను ఢీకొట్టాడన్నారు. ఈ ప్రమాదంలో బాలు అతని భార్యకు గాయాలయ్యాయని వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బైక్‌ను ఆటోతో ఢీకొట్టిన తరుణ్‌తో పాటు అతని తల్లిదండ్రులు సాంబయ్య, మంజులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## పంచాయతీ కార్మికుల సంఘం మండల కమిటీ ఎన్నిక

కాటారం, జూలై 3 : మండలకేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, సంఘం ముఖ్య సలహాదారులు దోమల శ్రీనివాస్, మెండ మల్లేశ్, ఇనుగాల కొండయ్య సమక్షంలో కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా పప్పుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బొర్రకుంట రవి, ఉపాధ్యక్షుడిగా బోడ రాజయ్య, కోశాధికారిగా ఆత్కూరి రవి, సహాయకార్యదర్శిగా కాల్వ రమేశ్, కార్యవర్గ సభ్యులుగా రాజేశ్వరి, బ్రహ్మం, రమేశ్, గౌరమ్మ, కమల, ఎల్లారి, మోసిన్, స్వామి, శ్రీను ఎన్నికయ్యారు.

## నేడు మండల సర్వసభ్యసమావేశం

చిట్యాల, జూలై 3 : మండల సర్వసభ్య సమాశం నేడు ఎంపీపీ దావు వినోదా వీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

# ‘కొత్త’ వెలుగులు



- కార్మికుల ఖాతాల్లో నూతన వేజ్‌బోర్డు వేతనాలు
- 41వేల మందికి ప్రయోజనం
- కోలిండియా కంటే ముందే అమలు
- సంస్థపై ఏడాదికి రూ.వెయ్యి కోట్ల అదనపు వ్యయం

రామగిరి, జూలై 3 : సింగరేణి కార్మికుల జీవితాల్లో సోమవారం ‘కొత్త’ వెలుగులు నిండాయి. సోమవారం ఎప్పటిలాగే గనుల్లో విధులకు హాజరైన కార్మికులు కొత్త వేజ్ బోర్డు వేతనాలను అందుకొని మరింత ఉత్సాహంతో ఇంటికెళ్లారు. కోలిండియా కంటే ముందుగానే సింగరేణి సంస్థలో కార్మికులకు యాజమాన్యం వేజ్‌బోర్డు జీతాలను అందజేయగా, దీంతో సంస్థకు రూ.1000 కోట్ల అదనపు వ్యయం పడనున్నది. సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ ఆదేశంతో యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు చేయగా, కొత్త జీతాలు అందుకున్న కార్మికులు అదే ఉత్సాహంతో లక్ష్య సాధనకు శ్రమించాలని సీఎండీ పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో ఇటీవల కుదిరిన 11వ వేతన ఒప్పంద వేతనాలను కార్మికులకు తక్షణమే యాజమాన్యం అమలు చేసింది. సీఎండీ ఆదేశాలతో సంస్థ డైరెక్టర్ బలరాం స్వీయ పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేసి జూన్ నెల జీతాలను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. గత 10 వేజ్ బోర్డు వేతనాల అమలుతో పోలిస్తే ఇది ఒక సంచలన నిర్ణయంగా చెప్పవచ్చు. గతంలో వేజ్ బోర్డు నిర్ణయాలు జరిగిన తర్వాత జీతాల చెల్లింపునకు నెలల తరబడి సమయం పట్టేది. కోలిండియాలో అమలు జరిపిన తర్వాతే సింగరేణిలో అమలు జరిపే పరిస్థితి ఉండేది. కానీ, అందుకు భిన్నంగా ఎవరూ ఊహించని విధంగా కార్మికులకు కొత్త వేజ్‌బోర్డు జీతాలు అందించడం విశేషంగా కార్మిక వర్గం చెప్పుకుంటున్నది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి బొగ్గు గని ఉద్యోగుల వేతనాలను చర్చించి నిర్ణయించే జేబీసీసీఐ సమావేశాలు ఈ మధ్యే ముగిసిన విషయం విధితమే. దేశంలోని బొగ్గు పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగుల జాతీయ వేతన ఒప్పందం ద్వారా పెరిగిన బేసిక్ ఇతర అలవెన్సులను ఈనెల జీతాల నుంచే ఉద్యోగులకు చెల్లించేందుకు యాజమాన్యం నిర్ణయించింది. జేబీసీసీఐ వద్ద అంగీకరించిన వివరాల ప్రకారం భూగర్భ ఉద్యోగి కనిష్ఠ, గరిష్ఠ స్థాయి డిసిగ్నేషన్‌ల జీతాలు గణనీయంగా పెరిగాయి. మారిన కొత్త బేసిక్‌ల ప్రకారం డైలీ రేటెడ్ కేటగిరీ-1 ఉద్యోగి స్థూలంగా నెలకు రూ.59,386.57 జీతంగా పొందారు. మంత్లీ రేటెడ్ ఉద్యోగులు స్థూలంగా నెల జీతం రూ.2,16,618.74 పొందారు. కాగా, పెరిగిన వేతనాలను సద్వినియోగం చేసుకుంటూ కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకతకు తోడ్పడాలని సీఎండీ శ్రీధర్ కోరారు. కోలిండియాలో ఇంకా వేజ్‌బోర్డులో నిర్ణయించిన వేతనాల చెల్లింపు జరగకముందే సింగరేణిలో జూన్ నెల జీతాలతో పెరిగిన బేసిక్ అలవెన్సులను అమలు చేస్తుండడం విశేషం. ఉద్యోగుల సంక్షేమం కోసం ఇతర సంస్థలతో పోలిస్తే సింగరేణి ముందంజలో ఉంటుందని సీఎండీ పేర్కొన్నారు. కాగా, రామగుండం రీజియన్‌లోని పలు భూగర్భ, ఓసీపీల గనుల్లో కార్మికులు విధులు ముగించుకొని కొత్త వేతనాలు బ్యాంకుల్లో జమ అయ్యాయని తెలిసి ఆనందంతో ఇంటికి వెళ్లడం కనిపించింది. ఎక్కడ చూసినా నలుగురు కార్మికులు కూడిన చోట ఎవరికి ఎంత పెరిగాయనేది చర్చ వినిపించింది.

### కార్మికులకు శుభాకాంక్షలు

గోదావరిఖని, జూలై 3 : సింగరేణిలో కొత్త జీతాలు జూన్ నుంచి అమలు చేసి జూలై 3న పేమెంట్ చెల్లిస్తున్నందున యాజమాన్యానికి, అన్ని విధాలా కృషి చేసిన సిబ్బందికి సీఐటీయూ పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆ సంఘం నాయకులు మెండె శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త జీతాలు ఈ నెల నుంచి అమలు కావట్లేదని అబద్ధపు ప్రచారాన్ని ఆయన ఖండించారు. సింగరేణికి భిన్నంగా కోలిండియాలో అటెండెన్స్ బోనస్‌ను జూన్ వేతనంతో చెల్లిస్తున్నారని, ఇది ఐదేండ్లుగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# గని, రోడ్డు ప్రమాదాలపై కార్మికులకు అవగాహన



శ్రీరాంపూర్ : ఎస్సార్పీ 3పై భద్రతపై కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య

జయశంకర్ భూపాలపల్లి, జూలై 3 (నమస్తే తెలంగాణ) : ఇటీవల సింగరేణిలో జరుగుతున్న గని ప్రమాదాలు, బయట కార్మికులు రోడ్డు ప్రమాదాలకు గురి కావడం వంటివి జరుగుతుండడంతో సింగరేణి యాజమాన్యం అప్రమత్తమైంది. గని, రోడ్డు ప్రమాదాలపై సంస్థ ఉద్యోగులకు గని స్థాయిలోనే కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించాలని యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసింది. ఈ మేరకు స్థానిక అధికారులు తరచూ గనుల్లో ప్రమాదాలకు గురయ్యే కార్మికులను గుర్తించారు. ఇలా గనుల వారీగా గుర్తించిన కార్మికులకు ఆయా గనుల వద్దే సంక్షేమాధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా భూపాలపల్లి ఏరియాలో సోమవారం కేటీకే 1, 8వ గనుల కార్మికులకు గని, రోడ్డు ప్రమాదాలపై వెల్ఫేర్ ఆఫీసర్లు కౌన్సెలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ ఆఫీసర్లు ఎస్ సాధన్, సాయికృష్ణ మాట్లాడుతూ.. గనుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇలా జరుగకుండా ఉండాలంటే విధులు నిర్వహించే క్రమంలో యాజమాన్యం సూచించిన రక్షణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. ‘నా రక్షణ నా బాధ్యత’ నినాదాన్ని గనుల్లో విధులు నిర్వహించేటప్పుడు, బయట రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తప్పకుండా పాటించాలని సంక్షేమాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గని కార్మికులతో పాటు ఆయా యూనియన్ల పిట్ సెక్రటరీలు, పిట్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రమాదరహిత గనిగా మార్చాలి

కాసిపేట, జూలై 3 : కాసిపేట గనిని జీరో ప్రమాదరహిత గనిగా మార్చేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని గని మేనేజర్ అల్లావుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ప్రమాదాల నివారణపై ఉద్యోగులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాల బారిన పడిన కార్మికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి ప్రమాదాలు జరగకుండా కృషి చేయాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో సునీల్ కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ మీర్జా గౌస్ జీషాన్, వొడ్నాల రాజన్న, మీనుగు లక్ష్మీనారాయణ, బండారు రమేశ్, రవి, సొల్లంకి శ్రీనివాస్, అండర్ మేనేజర్ సిద్ధార్థ, ఓవర్‌మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

### ప్రమాదాలను నివారించాలి

శ్రీరాంపూర్, జూలై 3 : కార్మికులు, ఉద్యోగులు ఎల్లవేళలా భద్రతతో పనిచేసి ప్రమాదాలు నివారించాలని కార్పొరేట్ జీఎం (సేఫ్టీ) గురువయ్య పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఎస్సార్పీ-3పై ‘నా భద్రత-నా బాధ్యత’, ‘నా భద్రతే నా కుటుంబ భద్రత’పై మానిటర్ల ఇంప్లిమెంటర్ల పాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేట్ జీఎం సేఫ్టీ గురువయ్య, జీఎం సంజీవరెడ్డి మాట్లాడారు. వ్యక్తిగత భద్రతతోనే ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, గని డీవైజీఎం సంతోష్‌కుమార్, అదనపు మేనేజర్ మహేందర్, చంద్రమూర్తి, ప్రేమ్‌కుమార్, అరుణ్‌కుమార్, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

### శ్రీరాంపూర్ ఓసీపీపై..

శ్రీరాంపూర్ ఓసీపీపై భద్రతపై సదస్సు నిర్వహించారు. రక్షణపై అవగాహన డ్రైవ్ సదస్సులో మేనేజర్ శ్రీనివాస్, ఈఈ శ్యాంసుందర్‌రావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మంద మల్లారెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ సంపత్, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి కందుల శంకరయ్య, సీనియర్ పీవో శంకర్, అండర్ మేనేజర్ వెంకన్న పాల్గొన్నారు.

### ఆర్కే న్యూటెక్‌పై ..

శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే న్యూటెక్ గనిపై మేనేజర్ స్వామిరాజు పాల్గొని కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గని సేఫ్టీ ఆఫీసర్ కొట్టె రమేశ్, సీనియర్ పీవో పాల్‌సృజన్, టీబీజీకేఎస్ ఏరియా చర్చల ప్రతినిధి బుస్స రమేశ్, ఈఈ రాజగోపాలాచారి, శంకర్ పాల్గొన్నారు.

### ఆర్కే 6గనిపై..

శ్రీరాంపూర్ ఆర్కే 6 గనిపై కార్మికులకు సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్మికులతో రక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్, గని మేనేజర్ తిరుపతి, సేఫ్టీ ఆఫీసర్ రాందాస్, ఈఈ వీరన్న, కొమురయ్య, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి ఇప్ప భూమయ్య, ఏరియా కార్యదర్శి అడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు.


## భగీరథ నీటి సరఫరాకు పరిశీలన

పలిమెల, జూలై 3 : మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌కు మిషన్ భగీరథ నీటి సరఫరా చేసేందుకు సాధ్యాసాధ్యాలను స్పెషల్ ఆఫీసర్ సుధీర్ కుమార్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ, డీఈ, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈ అధికారులు పరిశీలించారు. ఈ విషయంపై చర్చించిన అధికారులు ఇప్పుడున్న మిషన్ భగీరథ లైన్ నుంచి నీటి సరఫరా ఇవ్వలేమని స్పష్టం చేశారు. నీటిని మళ్లించడం వల్ల కింది గ్రామాలకు సక్రమంగా నీరు అందిచలేమన్నారు. ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో బోర్ వేసి ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేకుండా మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసుకుంటేనే సాధ్యమవుతుందన్నారు. పూర్తి వివరాలను అడిషనల్ కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఆయన దేశాల మేరకు పనులు ప్రారంభించవచ్చన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, సర్పంచ్ పుష్పలత, ఎంపీడీవో ప్రకాశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

## దంపతులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

చిట్యాల, జూలై 3 : కులంపేరుతో దూషించిన ఇద్దరు వ్యక్తుల(దంపతులు)పై ఎస్సీ, ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎండీ షాఖాన్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంచరామి గ్రామానికి చెందిన కాసు సురేశ్, కాసు శిరీష బావుసింగ్‌పల్లి గ్రామంలోని లంబాడా కులానికి చెందిన అజ్మీరా జవహర్‌లాల్‌ను, అతడి భార్యను కులం పేరుతో దూషించి బయభ్రాంతులకు గురిచేసినట్లు చెప్పారు. కాగా, బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## సిక్కా కేంద్ర ఉపాధ్యక్షుడిగా సంజీవరావు ఏకగ్రీవం



దాసారపు సంజీవరావు

జయశంకర్ భూపాలపల్లి, జూలై 3 (నమస్తే తెలంగాణ) : క్లర్కుల సమస్యల పరిష్కార వేదికైన సింగరేణి కాలరీస్ క్లరికల్ అసోసియేషన్ (సిక్కా) కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా దాసారపు సంజీవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం తోటి ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు. సిక్కా భూపాలపల్లి బ్రాంచి కార్యదర్శులుగా సొప్పరి రాంచందర్, గంగినేని సతీశ్ ఎన్నికయ్యారు.